క్లుప్తంగా

కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి

పెదగంట్యాడ: కమ్యూనిటీ భవన నిర్మాణ పనులను చకచకా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి కోరారు. ఈ మేరకు వార్డు పరిధిలోని దయాల్‌నగర్ పాత సంఘం పాక వద్ద కొత్తగా నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఈ ప్రాంతంలో రోడ్లు, కాలువ నిర్మాణ పనులు త్వరలో ప్రారంభిస్తామని చెప్పారు. కార్యక్రమంలో జీవీఎంసీ అధికారులు, నాయకులు ఎన్‌వై నాయుడు, దుర్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా గ్రాడ్యుయేషన్ డే



పట్టభద్రులైన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్సీ మాధవ్

ఉక్కునగరం: ఉక్కు విమల విద్యాలయంలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఉత్సాహంగా నిర్వహించారు. గురువారం జరిగిన వేడుకలకు మాజీ ఎమ్మెల్సీ పి.వి.ఎన్.మాధవ్ హాజరై విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. గ్రాడ్యుయేట్ అవ్వడం జీవితంలో తొలిమెట్టు మాత్రమే అని, దీని తర్వాత నిరంత కృషి నైతిక విలువలు, సమాజ సేవ వంటి అంశాలతో జీవితంలో అలవర్చుకోవాలన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ యిలేరియా మాట్లాడుతూ ఈ ఏడాది విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చాని ప్రశంసించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల కమిటీ ప్రధానకార్యదర్శి జెర్రిపోతుల మోహనకుమార్, ఉపాధ్యాయులు అనిత, దేవదాస్, మధుసూదన్, రవి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'మాపై కక్షతోనే ఫిర్యాదు'



మాట్లాడుతున్న మంత్రి మంజుల

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు వాంబే కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీ చోరీ చేసిన వారిని పోలీసులకు అప్పగించామనే కక్షతో తమపై తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారని ఆలయ ధర్మకర్త మంత్రి మంజుల తెలిపారు. ఆలయ ఆవరణలో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 24న రాత్రి ఆలయంలో హుండీ చోరీకి గురైందన్నారు. నిందితులను పోలీసులకు అప్పగించామన్నారు. దాన్ని సహించలేక నిందితుల్లో ఒకరు తమపై తప్పుడు ఫిర్యాదు చేశారని ఆరోపించారు. పోలీసులు లోతుగా విచారించి నిజానిజాలు నిగ్గు తేల్చాలని కోరారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

అక్కిరెడ్డిపాలెం: గాజువాక చైతన్యనగర్‌లో గురువారం గుర్తు తెలియని వ్యక్తి (సుమారు 48 ఏళ్లు) మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. వారు సమాచారం ఇవ్వడంతో గాజువాక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. మృతుడు కొద్ది కాలం కిందట స్థానికంగా ఉండే కార్ గ్యారేజ్‌లో పనిచేశాడని స్థానికులు తెలిపారు. ఇటీవల కామెర్లతో బాధపడుతున్నాడని, ఆ కారణంగా మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు.

అపరిచిత వ్యక్తులతో జాగ్రత్త

మద్రిపాలెం: అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉంటూ పోలీసులకు సమాచారం అందించాలని కంచరపాలెం ఐదో పట్టణ సీఐ రవికుమార్ అన్నారు. నేరాల నియంత్రంపై గాంధీనగర్‌లో తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు బానిస కాకూడదని, భవిష్యత్తును అందంగా మలుచుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు. గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. తల్లిదండ్రులు వారి పిల్లలనుగమనిస్తూ ఉండాలన్నారు.

ప్రజా హితం.. అభివృద్ధి మంత్రం

మహిళా సాధికారితకు కంకణం

నిర్వాసితకాలనీలు, పరిసర గ్రామాల్లో ఒంటిరి మహిళలు, నిరుపేద మహిళలకు జీవనోపాధి కలిప్పించడానికి పరస్పర సహకార సంఘాన్ని ఏర్పాటు చేసి శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించారు. చిల్లర వ్యాపారం చేసుకోడానికి ముందుకొచ్చే మహిళలకు వడ్డీలేని రుణాలు అందిస్తున్నారు.



సుందరంగా తీర్చిదిద్దిన వాడచీపురుపల్లి పీహెచ్‌సీ ఆవరణ

ఆరోగ్యమే పరమావధిగా...

స్థానికుల ఆరోగ్యమే పరమావధిగా భావించిన ఫౌండేషన్ సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా వాడచీపురుపల్లి పీహెచ్‌సీ ఆవరణాన్ని సుందరంగా, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దింది. ఉద్యానవనం ఏర్పాటు చేసి రోగులు సేదతీరడానికి బెంచీలు ఏర్పాటు చేసింది. ఈ ఏడాది నుంచి పరిసర గ్రామాల్లో సంచార వైద్య శిబిరాలు నిర్వహించి గ్రామస్థాయిలో వైద్య సేవలు అందించేందుకు సన్నాహక చర్యలు చేపట్టారు.



ఉపకార వేతనాలు అందుకున్న విద్యార్థులతో రాంకీ ఎండీ లాల్‌కృష్ణ, రాంకీ ఫౌండేషన్ అధ్యక్షుడు రామిరెడ్డి (ఫైల్)

విద్య, వైద్యం, మహిళా సాధికారిత, వ్యవసాయానికి పెద్దపీట

విస్తృతంగా 'రాంకీ' సీఎస్సార్ కార్యక్రమాలు

అగనంపూడి: సామాజిక వికాసం.. మహిళా సాధికారిత.. వ్యవసాయదారుల జాగృతం.. నాణ్యమైన, గుణాత్మక విద్య, మెరుగైన వైద్య సౌకర్యాలతో నిరుపేద వర్గాలకు అండగా నిలవాలనే అభిమతంతో రాంకీ ఫౌండేషన్ సీఎస్సార్ కార్యక్రమాలు చేపడుతోంది. దశాబ్దంన్నర కాలంగా నిర్వాసితులు, పరిసర గ్రామస్తుల ఆదరాభిమానాలు చూరగొంటుంది.

ఫౌండేషన్ ఏర్పాటు ఇలా..

జేఎస్‌పీసీ (రాంకీ డెవలపర్) ఆధ్వర్యంలో రాంకీ ఫౌండేషన్ ఏర్పాటు చేశారు.

దశాబ్దంన్నర కాలంగా ఫార్మా నిర్వాసితకాలనీలు, పరిసర గ్రామాల్లో సామాజిక బాధ్యతా కార్యక్రమాలు, ప్రజా హిత కార్యక్రమాలతో దూసుకుపోతొంది. ఎండీ లాల్ కృష్ణ ఆధ్వర్యంలో రాంకీ ఫౌండేషన్ విశాఖ ఇన్‌చార్జి శ్రీకాంత్ పర్యవేక్షణలో కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. విద్యార్థులు, మహిళలు, రైతన్నల మన్ననలు పొందుతున్నారు. కేవలం పరవాడ మండల పరిధిలోని గ్రామాలకే కాకుండా గిరిజన ప్రాంతాల్లో కూడా వివిధ కార్యక్రమాలు అమలు చేస్తోంది. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రగతి బాటలు వేస్తుంది.

నాణ్యమైన విద్య అందించే లక్ష్యంతో....

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో పలు కార్యక్రమాలు కొనసాగిస్తుంది. ఫార్మాసిటీ నిర్వాసితకాలనీ లేమర్తి ఉన్నత పాఠశాలతో పాటు వాడచీపురుపల్లి, పరవాడ, తానం ఉన్నత పాఠశాలల్లో కంప్యూటర్ ల్యాబ్‌లు ఏర్పాటు చేసింది. ల్యాబ్‌లతోపాటు కంప్యూటర్ బోధకులను ఏర్పాటు చేసి కంప్యూటర్‌పై కనీస పరిజ్ఞానం అందించేలా ఏర్పాటు చేసింది.



చిరు వ్యాపారులకు బైక్‌లు అందిస్తున్న సీహెచ్‌వో సుజీవ్ నాయర్ తదితరులు(ఫైల్)

వ్యవ'సాయం'

అన్నదాతలకు అండగా నిలవాలనే సంకల్పంతో మండల పరిధిలోని నాయుడుపాలెం, రావాడ పంచాయతీల్లో భూ సంరక్షణ, మెరుగైన దిగుబడి సాధించేందుకు వీలుగా 250 మంది రైతులకు సేంద్రియ వ్యవసాయానికి సహకారం అందిస్తోంది. రైతులకు అవసరమైన వ్యవసాయ యంత్రాలను అందించింది. అలాగే నాబార్డుతో జతకట్టి కొయ్యూరు మండలంలోని 1500 ఎకరాల్లో మామిడి, జీడి మామిడి మొక్కల పెంపకం చేపట్టి 1500 గిరిజన కుటుంబాలను ఉపాధి బాట పట్టించింది.

సేవే మార్గంగా...

వీటితోపాటు అగనంపూడి హోమీబాబా కేన్సర్‌ఆస్పత్రి వద్ద ప్రయాణికులు సేదతీరడానికి బస్ షెల్టర్లు నిర్మించింది. అలాగే తానాం గ్రామ ప్రజలకు సురక్షిత మంచినీటిని అందించేందుకు నీటి శుద్ధి ప్లాంట్ ఏర్పాటు చేసింది. పరవాడ హాస్టల్‌కు పలు పరికరాలు అందించింది.

ఉన్నత చదువులకు సహకారం

పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన నిరుపేద విద్యార్థులతోపాటు నిరుపేద, చిరుద్యోగులు సుమారు 150 మందికి ఇటీవల రూ.13 లక్షలు ఉపకార వేతనంగా అందించింది. అలాగే స్కిల్ డెవలప్‌మెంట్‌పై విద్యార్థులకు శిక్షణ ఇస్తూ ఉపాధి అవకాశాలు కల్పిస్తోంది. నిర్వాసితకాలనీలతోటు పరిసర గ్రామాలు, పాఠశాలల విద్యార్థులకు ఉచిత వైద్య, దంత, నేత్ర వైద్య శిబిరాలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు, కళ్లద్దాలు అందిస్తూ వస్తోంది. అగనంపూడి, లంకెలపాలెం, ఫార్మాసిటీ పరిసర గ్రామాల్లోని ఉన్నత పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ కోసం వంట సామగ్రి, గ్యాస్‌పొయ్యిలు, మిక్సీలు, గ్రైండర్లు అందించింది.

ఎన్నాళ్లీ వెతలు?

- సింహాద్రినగర్‌వాసుల మండిపాటు
- మురుగునీటి కూపం వద్ద నిరసన తెలిపిన బాధితులు



మురుగునీటి కుంట వద్ద కూర్చొని నిరసన వ్యక్తం చేస్తున్న గెంజి సురేష్



నిరసన తెలుపుతున్న మహిళలు

అగనంపూడి: ఇళ్ల మధ్యలో మురుగునీరు నిలిచి దోమలు, దుర్వాసనతో ఆర్నెల్లుగా ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు నిరసన తెలిపారు. తమకు ఎన్నాళ్లీ వెతలు అని మండిపడ్డారు. వివరాలు.. జీవీఎంసీ 85వ వార్డు లంకెలపాలెం శివారు సింహాద్రినగర్‌లో ఇళ్ల చుట్టూ మురుగునీరు చేరి దుర్గంధభరితంగా మారింది. దోమలు, క్రిమి కీటకాలకు నిలయంగా మారడంతో పాటు పందులకు ఆవాసంగా మారింది. దీంతో కాలనీకి చెందిన మహిళలు గురువారం మురునీటి వద్ద నిరసన వ్యక్తం చేశారు. మురునీటి గుంట వద్ద వైఎస్సార్‌సీపీ నాయకుడు గెంజి సురేష్ బైఠాయించి నిరసన వ్యక్తం చే శారు. గత ప్రభుత్వం హయాంలో రోడ్లు, డ్రైనేజీలు నిర్మించారని, తరువాత వచ్చిన ప్రభుత్వం కనీసం ఔట్‌లెట్ కూడా నిర్మించకపోవడంతో ఇళ్లల్లో వాడుక నీరు వచ్చి ఇళ్ల మధ్యలో చేరుతుందన్నారు. మహిళలు మాట్లాడుతూ ఆరు మాసాల నుంచి మా గోడు జీవీఎంసీకి వినిపించినా పట్టించుకొనే పరిస్థితి లేకపోవడంతో మురుగునీటిగుంట వద్ద నిరససన తెలపాల్సి వచ్చిందన్నారు. ఇప్పటికైనా కమిషనర్ స్పందించి సత్వర చర్యలు చేపట్టాలని కోరారు.

దోపిడీ దొంగల అరెస్ట్

పెదగంట్యాడకు చెందిన వారిగా గుర్తింపు



మాట్లాడుతున్న క్రైం డీసీపీ మోహనరావు

అక్కిరెడ్డిపాలెం: పార్కింగ్ చేసిన లారీల అద్దాలు పగులగొట్టి డ్రైవర్లపై దాడి చేసిన దొంగలు పెదగంట్యాడకు చెందిన వారిగా గుర్తించామని క్రైం డీసీపీ మోహనరావు తెలిపారు. గురువారం గాజువాక క్రైం పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. బుధవారం వేకువ జామున రెండు వేర్వేరు ప్రాంతాల్లో రోడ్డు పక్కన పార్కింగ్ చేసి లారీల అద్దాలు పగులగొట్టి క్యాబిన్ల నిద్రిస్తున్న డ్రైవర్లపై దాడి చేసి నగదు, సెల్ ఫోన్లను లాక్కొని పరారైన దొంగలు పెదగంట్యాడకు చెందిన వారిగా గుర్తించామ న్నారు. వారిలో సాది హరికృష్ణ (23), పెదగంట్యాడ, మదీనాబాగ్‌కు చెందిన వాడని, రెండో వ్యక్తి గరికిన శివ (24), పెద గంట్యామండలం అప్పికొండ దరి దేవాడకు చెందిన వాడని తెలిపారు. వీరికి నేర చరిత్ర ఉందని, చెడు అలవాట్లకు బానిసై ఈజీగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ఈ విధమైన చర్యలకు పాల్పడ్డారని తెలిపారు. లారీ డ్రైవర్లు నిర్జీవ ప్రాంతాలు, జనసంచారం లేని ప్రాంతాల్లో లారీలను పార్కింగ్ చేయవద్దని సూచించారు. యార్డుల్లో పార్కింగ్ సురక్షితంగా ఉంటుందని అక్కడ పార్కింగ్ చేసుకోవాలని అన్నారు.

దర్యాప్తు ముమ్మరం

గ్రీన్ పార్క్ ఏరియాలో ఇటీవల 90 తులాల బంగారం చోరీ కేసుకు సంబంధించి దర్యాప్తు ముమ్మరం చేసినట్టు తెలిపారు. అలాగే హోలీని ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు. సమావేశంలో క్రైం ఏడీసీపీ డి.లక్ష్మణరావు, సౌత్ సబ్‌డివిజన్ క్రైం ఇన్‌చార్జి సీఐ జి.దాలిబాబు, ఎస్‌ఐ మన్మథరావు, క్రైం సిబ్బంది పాల్గొన్నారు.

ఉక్కు అధికారుల సంఘం చేయూత



కుటుంబ సభ్యులకు చెక్కులు అందజేస్తున్న అధికారుల సంఘం ప్రతినిధులు

ఉక్కునగరం: అనారోగ్యంతో ఇటీవల మరణించిన స్టీల్‌ప్లాంట్ అధికారుల కుటుంబాలకు ఉక్కు అధికారుల సంఘం (సీ) తమ వంతు చేయూత అందించింది. గురువారం సీ భవనంలో ఉక్కు జనరల్ ఆస్పత్రి రేడియాలజీ విభాగం మేనేజర్‌గా పనిచేసి మరణించిన మంచూరి సుధాకర్ సతీమణి ఉషారాణికి రూ.30 వేలు, ప్రమాదవశాత్తు మరణించిన స్టీల్ మెల్ట్ షాప్ విభాగం అసిస్టెంట్ జనరల్ మేనేజర్ సోమరాజు కుమారుడు అభిషేక్‌కు రూ.60 వేలు ఇచ్చారు. అలాగే తీవ్ర అనారోగ్యంతో దీర్ఘకాలిక సెలవులో ఉన్న స్టీల్ మెల్ట్ షాపు డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎం.కె.జెనాకు రూ. 45 వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఉక్కు అధికారుల సంఘం అధ్యక్షుడు కాటం చంద్రరావు, ప్రధానకార్యదర్శి కె.వి.డి.ప్రసాద్, కార్యవర్గ సభ్యులు తెలికచర్ల శ్రీనివాసరావు, దాలినాయుడు, టౌన్ అడ్మినిస్ట్రేషన్ అధికారి సింహాద్రి పాల్గొన్నారు.

కార్మికుల జీతాల కోతపై స్పందించాలి

కాంట్రాక్ట్ కార్మికుల వినతి

అక్కిరెడ్డిపాలెం: భెల్ (హెచ్‌పీవీపీ) సంస్థలో కొన్ని సంవత్సరాలుగా పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల జీతాల్లో కోత విధించడంపై సంస్థ కార్మిక సంఘాలు స్పందించాలని కాంట్రాక్టు కార్మికులు కోరుతున్నారు. పర్మినెంట్ ఉద్యోగుల వలే ఉత్పత్తిలో భాగస్వామ్యం అవుతున్నా... సుమారు 200 మందికి పైగా కార్మికులకు చట్ట ప్రకారం జీతాలు చెల్లించకపోయినా తప్పని పరిస్థితుల్లో పనిచేస్తున్నారన్నారు. వీరికి ప్రతీ నెలా జీతంలో రూ.200 నుంచి రూ.500 వరకు కాంట్రాక్టర్ వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశంపై యాజమాన్యంతో చర్చలు జరిపి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడి పాత పద్ధతిలోనే జీతాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని విన్నవిస్తున్నారు.

తుప్పు పట్టిన విద్యుత్ స్తంభాల తొలగింపు



స్తంభాలను తొలగిస్తున్న జీవీఎంసీ విద్యుత్ విభాగం సిబ్బంది

అక్కిరెడ్డిపాలెం: ప్రాణం పోతేగానీ అధికారుల్లో చలనం రాలేదు. మంగళవారం విశాఖ డెయిరీ జంక్షన్‌లో రోడ్డు దాటదానికి వేచి ఉన్న ఉన్న ఇద్దరిపై తుప్పు పట్టిన విద్యుత్ స్తంభం పడిపోవడంతో ఒకరు మరణించారు. దీంతో జీవీఎంసీ విద్యుత్ విభాగం అధికారులు మేల్కొన్నారు. కె.కోటపాడుకు చెందిన బొత్స కామేశ్వరరావు (37), దొడ్డి సత్యవతిలపై తుప్పు పట్టిన విద్యుత్ స్తంభానికి ఉన్న వైరు వెళ్తున్న ఆర్‌టీసీ బస్సుకు ఇరుక్కుని ఒక్క సారిగా రోడ్డు దాటడానికి వేచి ఉన్న వీరిపై పడిపోయింది. ఈ ప్రమాదంలో కామేశ్వరరావు తీవ్ర గాయాలతో కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మరణించాడు. సత్యవతి గాయాలతో బయటపడింది. దీంతో జీవీఎంసీ విద్యుత్ విభాగంలో చలనం వచ్చింది. గురువారం జాతీయ రహదారి పక్కన తుప్పు పట్టిన విద్యుత్ స్తంభాలను తొలగించే ప్రక్రియ చేపట్టారు.

ఫ్లైఓవర్ నిర్మించాలని వినతి



డీఆర్‌ఎంను సత్కరించి వినతిపత్రం అందిస్తున్న అగనంపూడి నాయకులు

అగనంపూడి: జీవీఎంసీ79, 85,88 వార్డుల్లోని పలు కాలనీలను అనుసంధానం చేసే తలారివానిపాలెం అండర్‌పాత్ వంతెన స్థానంలో ఫ్లైఓవర్ నిర్మించాలని అగనంపూడికి చెందిన ప్రజా సంఘాల నాయకులు వాల్తేరు డీఆర్‌ఎం లలిత్ బోరాను కోరారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆయన్ను శాలువాతో సత్కరించి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నాలుగు అడుగుల ఎత్తు, నాలుగు అడుగుల వెడల్పుతో ఉన్న రైల్వే అండర్‌పాత్ వల్ల ద్విచక్రవాహనంతో వెళ్లడానికి కూడా ఇబ్బందులు పడాల్సి వస్తుందని వివరించారు. సుమారు లక్ష మంది ప్రజలు నివాసముంటున్న కాలనీలను అనుసంధానం చేసే ఇలాంటి వంతెన విస్తరించాలని, లేదా ఫ్లైఓవర్ నిర్మించాలని నాయకులు కోరారు. జేఎస్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీ, జీవీఎంసీ కాలనీ, హుద్ హుద్ కాలనీతోపాటు సంధ్యానగర్, మంగళపాలెం, దువ్వాడ సెక్టార్-1, గంగవరం ప్రాంతాల్లో 60వేలకు పైగా ప్రజలు నివాసముంటున్నారని, కళాశాలు, ఆస్పత్రి, బ్యాంక్‌లు, సంత, పాఠశాలలకు, విద్యుత్ కార్యాలయం అగనంపూడిలో ఉండడంతో నిత్యం వేలాది మంది రాకపోకలు సాగిస్తున్నారని పేర్కొన్నారు. వంతెన ఇబ్బందికరంగా ఉండడంతో అదనంగా ఐదు కిలో మీటర్ల దూరం ప్రయాణం చేయాల్సి వస్తుందని వివరించారు. ఈవిషయంలో చొరవ తీసుకోవాలని డీఆర్‌ఎంను నాయకులు బి.సత్యనారాయణ, కె.రామ్‌కుమార్, కె.తాతారావు, ఎం.వి.రమణ, వి.నారాయణరావు, బి.చందు రమేష్, పి.అచ్యుత్ కోరారు.

స్ఫూర్తిప్రదాత కవయిత్రి మొల్ల



మొల్ల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న తిప్పల దేవన్‌రెడ్డి తదితరులు

పెదగంట్యాడ: తొలి తెలుగు కవయిత్రి మొల్ల జయంతిని జీవీఎంసీ 76వ వార్డు పరిధి నడుపూరు కుమ్మరివీధిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విగ్రహానికి వైఎస్సార్ సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశం గర్వించదగిన కవయిత్రి మొల్ల అని, భావితరాలకు స్ఫూర్తి ప్రదాత అని పేర్కొన్నారు. తెలుగు భాషలో మొల్ల రామయణ కావ్యాన్ని రాసి ఆకట్టుకున్నారని కొనియాడారు. కుమ్మరి శాలివాహన సంఘం గౌరవ అధ్యక్షుడు కాదులూరి కనకారావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు మంత్రి శంకరనారాయణ, తలారి నాగేశ్వరరావు, శీర చిన్నారావు, పల్లం గోపి, రమణ, శ్రీనివాసరావు, అప్పలరాజు, కల్యాణ్, తాతారావు పాల్గొన్నారు.

గ్లకోమాపై అప్రమత్తత అవసరం



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ సుధాకర్

గాజువాక: గ్లకోమాను నిర్లక్ష్యం చేస్తే కంటిచూపును కోల్పోయే పరిస్థితి వస్తుందని గాజువాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) వైద్యాధికారి డాక్టర్ ఎం.సుధాకర్‌రావు అన్నారు. గ్లకోమా వారోత్సవాల్లో భాగంగా పీహెచ్‌సీలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్లకోమా వ్యాధి కంటి నరాన్ని చచ్చుబడిపోయేటట్లు చేస్తుందని, దీనివల్ల క్రమంగా కంటి చూపు తగ్గిపోయే అవకాశం ఉందన్నారు. ప్రారంభ దశలో ఎటువంటి లక్షణాలు కనిపించవన్నారు. 40 ఏళ్లు దాటిన వారు తరచూ కళ్లద్దాలు మార్చాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. వెలుతురు చుట్టూ రంగుల వలయంలాగా కనిపిస్తుందని, తరచూ తలనొప్పితో పాటు కళ్లు ఎరుపెక్కడం, వాంతులు రావడం, కనుగుడ్డు నొప్పిగా ఉండడం వంటి లక్షణాలుంటే వెంటనే పరీక్షలు చేయించుకోవాలన్నారు. బీపీ, సుగర్ ఉన్నవారు, కనుగుడ్డుపై గతంలో దెబ్బ తగిలినవారు కూడా గ్లకోమా పరీక్షలను చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సీహెచ్‌వో పి.నాగ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఈపీఎఫ్ కనీస పెన్షన్ రూ.5 వేలు నిర్ణయించాలి

18న కలెక్టరేట్ ఎదుట ధర్నా

అగనంపూడి: ఈపీఎఫ్ పెన్షన్ పథకాన్ని సవరించి 95 పెన్షన్ స్కీం అమలు చేస్తున్నా సవరణలో కనీస పెన్షన్ హామీ లేదని బీఎంఎస్ అఖిల భారత ఉపాధ్యక్షుడు ఎం.జగదీశ్వరరావు అన్నారు. కనీస పెన్షన్ రూ. 5 వేలు చేయాలనే డిమాండ్‌తో ఈ 18న భారతీయ మజ్దూర్ సంఘ్(బీఎంఎస్) ఆలిండియా కమిటీ పిలుపు మేరకు అన్ని జిల్లాల కలెక్టరేట్ల వద్ద నిరసన ధర్నాలు చేయనున్నట్టు తెలిపారు. ఈపీఎఫ్ పెన్షన్‌కు డీఏ జోడించాలని, ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా ఉచిత వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేస్తూ తలపెట్టిన నిరసన కార్యక్రమంలో పెన్షనర్లు పాల్గొవాలని ఆయన కోరారు.

ముగిసిన జ్యూట్ బ్యాగ్‌ల తయారీ శిక్షణ



సర్టిఫికెట్లతో శిక్షణపూర్తి చేసిన సత్యసాయి భక్తులు

ఉక్కునగరం: పర్యావరణ పరిరక్షణకు సత్యసాయి సేవా సంస్థలు కృషి చేస్తున్నాయని ఆ సంస్థ ప్రతినిధి ఆర్. లక్ష్మణరావు తెలిపారు. ప్లాస్టిక్ వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించామని అందువల్లే జ్యూట్ బ్యాగ్‌ల తయారీలో శిక్షణ ఇచ్చామని ఆయన చెప్పారు. సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా మొక్కలు నాటడం, కుట్టు మిషన్లు పంపిణీ వంటి కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంస్థ జిల్లా అధ్యక్షుడు వీఆర్ఎస్ నాయుడు, కె. నాగప్రసాద్, రామకృష్ణ, అపర్ణ, పలువురు సత్యసాయి భక్తులు పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న సివిల్ జడ్జి వెంకటశేషమ్మ, అధ్యాపకులు

మద్దిలపాలెం: చట్టాల గురించి విద్యార్థులు క్షుణ్ణంగా తెలుసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి ఎం.వెంకటశేషమ్మ అన్నారు. డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం విద్యార్థులకు చట్టాలపై ఆమె అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లలను లైగింక దాడులు, వేధింపుల నుంచి పోక్సో చట్టం-2012 రక్షిస్తుందన్నారు. పిల్లలపై లైంగిక వేధింపులకు పాల్పడే నిందితులకు మూడేళ్ల నుంచి ఐదేళ్ల వరకు జైలు శిక్ష, జరిమానా విధిస్తారన్నారు. నేరాల విచారణకు ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయడానికి, వేగవంతమైన, సమర్థవంతమైన న్యాయాన్ని అందించడానికి ఈ చట్టం వీలు కల్పిస్తుందని వెంకటు శేషమ్మ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.జయదేవి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, ఎన్ఎస్ఎస్ జోనల్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పి.ఉమామహేశ్వరరావు, డాక్టర్ బి.లక్ష్మి, డాక్టర్ బి.నాగేశ్వరరావు, డాక్టర్ జి.వి.ప్రతాప్, డాక్టర్ ప్రసన్న, డాక్టర్ జి.లక్ష్మణరావు, డాక్టర్ సీహెచ్. అనురాధ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి యువజనోత్సవాల్లో పతకాలు



పతకాలు సాధించిన గోపీచంద్, దీక్షితలను అభినందిస్తున్న ఏయూ వీసీ రాజశేఖర్

విశాఖ విద్య: జాతీయ స్థాయిలో నోయిడాలోని అమిటీ యూనివర్సిటీలో ఇటీవల నిర్వహించిన యువజనోత్సవాల్లో ఆంధ్ర విశ్వవిద్యాలయం తరఫున పాల్గొన్న ఇద్దరు విద్యార్థులు పతకాలు సాధించారు. ఏయూ ఫైన్ ఆర్ట్స్ విభాగానికి చెందిన బి.గోపీచంద్, జి.దీక్షిత ప్రతిభ చూపారు. క్లే మోడలింగ్ విభాగంలో గోపీచంద్ మూడో స్థానం, రంగోలిలో దీక్షిత నాలుగో స్థానం సాధించారు. ఈ సందర్భంగా గురువారం విద్యార్థులను ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయ రావు అభినందించారు. జాతీయ స్థాయిలో భవిష్యత్తులో మరింత మెరుగైన ప్రతిభను చూపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విభాగాధిపతి డి.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.